ప్రజాశక్తి
గురువారం 9 ఫిబ్రవరి 2023
5
పార్వతీపురం మన్యం



104 జిల్లా మేనేజర్‌గా దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో 104 వాహనాల జిల్లా మేనేజర్‌గా పూసర్ల వెంకట దుర్గా ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లాలో పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై జిల్లా మేనేజర్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. 104 వాహన సేవలు బాగా మెరుగు పడాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గాప్రసాద్

ఉడికీ ఉడకని అన్నం..కలుషిత తాగునీరు
మధ్యాహ్న భోజనం కలుషితం

30 మంది విద్యార్థులకు అస్వస్థత ● డిఎంహెచ్‌ఒ పరిశీలన


విద్యార్థులకు పెట్టిన ఆహారం


అంబులెన్స్‌లో విద్యార్థులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని కోన ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల అస్వస్థతకు మధ్యాహ్న భోజనం కలుషితమవ్వడమే కారణంగా ఉంది. ఉడికీ ఉడకని భోజనాన్ని విద్యార్థులకు పెట్టడంతో వారంతా కడుపునొప్పికి గురయ్యారు. మరోవైపు పాఠశాలలో విద్యార్థులు తాగే నీరు కూడా కలుషితమైనట్లు అధికారులు గుర్తించారు.

పాఠశాలలో 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం స్కూలులో భోజనం చేసిన వారిలో 30మంది వరకు విద్యార్థులు కడుపునొప్పితో బాధపడుతూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు, వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరికృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకొని అంబులెన్సులో పిహెచ్‌సికి తరలించారు. మరికొంతమంది తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని ఆటోలపై కొందరిని ఆస్పత్రికి తరలించారు. పిహెచ్‌సిలో డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రఘు పిల్లలకు వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది అప్రమత్తతతో అంతా కోలుకోవడంతో అధికారులు, పిల్లల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.


విద్యార్థులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఆగ్రహం

పాఠశాలలో గత మూడు రోజులుగా భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడకని అన్నం పెట్టి పిల్లలకు అనారోగ్యం తెచ్చిపెడుతున్నారని హెచ్‌ఎంపై మండిపడ్డారు. కలుషితమైన నీటిని వంటకు వాడుతున్నారని అన్నారు. పాఠశాలను పరిశీలించిన డిఎంహెచ్‌ఒ జనార్ధన్‌రావు, డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. అనంతరం దెబ్బగడ్డ గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

బయటపడ్డ విభేదాలు

పాఠశాలలో హెచ్‌ఎంకు, విద్యా కమిటీ మిడ్ డే మీల్స్ నిర్వాహకుల మధ్య ఉన్న విభేదాలు ఈ సందర్భంగా బహిర్గత మయ్యాయి. అధికారుల సమక్షంలోనే ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. స్థానిక హెచ్‌ఎంపై మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు గొట్టాపు లక్ష్మి ఆరోపణలు చేశారు. రూ.4వేలు ఇస్తామని , బాధ్యతలనుంచి వైదొలగాలని అంటున్నారని తెలిపారు. విద్యార్థులకు గుడ్లు సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. దీనికి ప్రతిగా హెచ్‌ఎం విద్యా కమిటీ నిర్వాహకులు సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు.


ఘటన గురించి విద్యార్థులను ఆరాతీస్తున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

ఎంఇఒ, హెచ్‌ఎం నిర్బంధం

తమ పిల్లలు అస్వస్థకు గురయ్యారన్న బాధతో హెచ్‌ఎం జయకుమార్‌ను, అక్కడికి చేరుకున్న ఎంఇఒ మల్లేశ్వరరావును తల్లిదండ్రులు పాఠశాల గదిలో పెట్టి నిర్బంధించారు. స్థానిక ఎస్ఐ పైడిరాజు తమ సిబ్బందితో వచ్చి తల్లిదండ్రులకు నచ్చజెప్పి వారిని బయటకు తీసుకువచ్చారు.

ఆంధ్రాలోకి మరో 5 ఏనుగులు

ప్రజాశక్తి -భామిని

మండలంలో పసుకుడి గ్రామ సమీపంలో చెరకు, అరటి తోటలో 10 రోజులుగా నాలుగు ఏనుగులు తిష్టవేసి ఉన్నాయి. జిల్లాలోకి సుమారు 15 ఏళ్ల క్రితమే ప్రవేశించి, మనుషుల ప్రాణాలకు, పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇవి చాలవన్నట్లు మరో 5 ఏనుగులు మంగళవారం రాత్రి మండలంలోకి ప్రవేశించాయి. ఒడిశాలోని కండువా గ్రామం మీదుగా నేరడి బ్యారేజ్, ఎబి రోడ్డు దాటి, బొమ్మిక గ్రామం మీదుగా మనుమకొండ గ్రామ సమీపంలోని రామాలయం కొండపై సంచరిస్తున్నాయి. ప్రస్తుతం ఏనుగులు సంచరించే ప్రదేశంలో పూర్తిగా జీడి, మామిడి తోటలు ఉండటం, గిరిజన ప్రాంతం కావటం రోజువారి పనులకు గిరిజనులు వెళ్లేందుకు భయాందోళన చెందుతున్నారు. పాలవలస, మనుమకొండ సర్పంచులు తమ్మారావు, నిమ్మల కేశవ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఏనుగులు జోలికి పోవద్దని, ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ప్రజలకు సూచించారు.


కొండపై సంచరిస్తున్న ఏనుగులు

రానున్న వందేళ్లకు
రీసర్వే రికార్డులే ప్రామాణికం

జాయింట్ కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రస్తుతం చేపడుతున్న రీసర్వే రికార్డులే రానున్న వంద సంవత్సరాలకు ప్రామాణికమని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలని తెలిపారు. రీసర్వేకు సంబంధించి ప్రతి మండలానికీ ప్రత్యేకంగా నియమించిన డిప్యూటీ తహశీల్దార్లకు కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వర్కుషాపులో ఆయన మాట్లాడారు. పక్కాగా సర్వే నిర్వహించి సాగుదారులకు తప్పుల్లేని భూహక్కు పత్రాలను అందించాలని తెలిపారు. సర్వేకు సంబంధించి ప్రాథమికంగా తయారు చేసే రికార్డులే కీలకమన్నారు. ఫీల్డ్‌లో భూమిపై సాగులో ఉన్నవారి వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్స్, పంపకాలు మొదలైనవి ప్రాథమిక దశలోనే పూర్తిచేస్తే పని సులభతరమవుతుందని, తరువాత సవరణలకు అవకాశం ఉండదని చెప్పారు. మొదటి దశలో గ్రామ, మధుర సరిహద్దులు గుర్తించాలన్నారు. ప్రభుత్వ భూములకు కూడా సరిహద్దులను గుర్తించి, వివరాలను ముందుగా రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. సర్వే చేపట్టే విధానంపై అవగాహన కల్పించి, డిప్యూటీ తహశీల్దార్లు వెలిబుచ్చిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐసిఇ డివిజినల్ మేనేజరు మూర్తి, డిఅండ్‌హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ రవికుమార్, డిఐఒ రామకృష్ణ, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి ఆనంద్

ధాన్యం వెంటనే కొనాలి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎంపిపి బొంగు సురేష్ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ, వ్యవసాయ అధికారితో సమీక్ష నిర్వహించారు. మండలంలో 26,496 మెట్రిక్ టన్నుల ధాన్యానికి 17,972 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని, మిగతా 8524 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు లిఖితపూర్వకంగా తెలిపారని ఎంపిపి చెప్పారు. పొలాల్లో పండించిన వరిపంట ఉండిపోయిందని, ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వాతావరణంలో మార్పులు జరిగితే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మిగిలి ఉన్న ధాన్యాన్ని వెంటనే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి నిరసనలు తెలియజేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపిపి నరేష్, ఎంపిడిఒ రమేష్, వ్యవసాయ అధికారి హర్షలత తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో గిరిశిఖర గ్రామాలను జిల్లా సివిల్ సప్లై అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి బుధవారం సందర్శించారు జెసి ఆదేశాల మేరకు కొండలపై ఉన్న గ్రామాలకు బియ్యం సరఫరా వాహనాలు ఎక్కడం లేదని సమాచారం రావడంతో డిఎస్ఒ ఆ గ్రామాల్లో పర్యటించారు. వజ్జాయిగూడ, జగత్‌పల్లి, జాజ్జువ తదితర గ్రామాల్లో పర్యటించి, బియ్యం సరఫరా చేస్తున్నారా? లేదా? రహదారి పరిస్థితి గురించి వాకబుచేశారు. బియ్యం ఆపరేటర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి మధుసూదన్ రావు, తదితరులు ఉన్నారు.

కళ్లాల్లోనే ధాన్యం

కన్నీరు పెడుతున్న రైతులు

ప్రజాశక్తి-సీతానగరం

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని నేటికీ ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. దీంతో కళ్లాల్లోనే రైతుల ధాన్యం దర్శనమిస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చేతికొచ్చిన పంట కళ్లంలో ఉండటంతో చూసి కన్నీరు పెట్టడం రైతు వంతైంది.

ప్రభుత్వం ఇ-క్రాప్ చేసిన రైతుల ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకుంటామని చెప్పినా నేటికీ కొనలేదు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సుమారు 30 మంది రైతులకు చెందిన ధాన్యం బస్తాలు కళ్లాల్లోనే ఉన్నాయి. కేవలం లక్ష్మీపురం గ్రామంలో సుమారు 3 వేల బస్తాల వరకు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. తామరకండిలో 8 వేల బస్తాలు, గెడ్డలుప్పిలో 4 వేల బస్తాలు, కృష్ణరాయపురంలో 2 వేల బస్తాల, వెంకంపేటలో వెయ్యి బస్తాల వరకు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. అన్ని గ్రామాల నుంచి రైతులు జిల్లా, మండల కేంద్రాలలో ఆందోళన చేసిన నేపథ్యంలో అధికారులు కలుగజేసుకొని ధాన్యం కొంటామని హామీనిస్తున్నారు. ఎక్కడ ఆందోళన జరుగుతుందో అక్కడే ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటిస్తున్నారు. కానీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


లక్ష్మీపురంలో కళ్లంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యబస్తాలు

వంద బస్తాలున్నాయి



మూడు ఎకరాల్లో వరిసాగు చేశాను. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాను. వంద బస్తాల వరకు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ కొనేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ధాన్యం సేకరించాలి.

- జి.భాస్కరరావు, లక్ష్మీపురం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



రెండు ఎకరాల్లో వరిసాగుచేసి, పొలంలోనే ధాన్యం నూర్పు చేసి విక్రయానికి సిద్ధం చేశాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ధాన్యాన్ని పొలాల్లో ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- పి.తిరుపతిరావు, లక్ష్మీపురం

సివిల్ సప్లై కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లాలో ఇంకా చాలా చోట్ల ధాన్యం అమ్మకానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా లక్ష్యం పూర్తయిందనే నెపంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో మక్కువ, వీరఘట్టం మండలాల రైతులు సోమవారం కలెక్టరేట్లో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీ పెట్టుకున్నారు. ఆ రైతులంతా బుధవారం సివిల్ సప్లై కార్యాలయంలో డిఎంఒ నాయక్‌ని కలవడానికి వచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం పూర్తి కావడంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిలిపివేశామని, ప్రభుత్వం నుంచి మళ్లీ అనుమతులు రాగానే కొనుగోలు ప్రారంభమవుతుందని సమాధానమిచ్చారు. మళ్లీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందని రైతులు అధికారులను ప్రశ్నించారు. అధికారుల నుంచి కూడా స్పష్టమైన సమాధానం రాలేదు. దీంతో రైతులంతా నిస్సహాయ స్థితిలో ఏమీ తోచక ఇళ్లకు వెనుదిరిగారు.

ప్రతి ధాన్యపు గింజా కొంటాం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. బుధవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణ, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో కలిసి సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి ధాన్యం సమస్యని తీసుకెళ్ళినట్లు చెప్పారు. అనంతరం అమరావతి నుంచి ఆయన స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంపై సిఎం జగన్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో మిగిలిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతు పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని తెలిపారు. ఏనుగుల సంచారంపై కూడా సిఎం జగన్ మోహన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఏనుగులను తరలించడానికి అవకాశం ఉందా? లేదా అన్న విషయంపై ముగ్గురు అటవీ అధికారులతో కమిటీని నియమించాలని ఆదేశించినట్లు వివరించారు. ఒకవేళ తరలించేందుకు అవకాశం లేకపోతే ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు పరిశీలించే అవకాశం గురించి కేంద్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఏనుగుల దాడిలో మరణించిన వారికి ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల పరిహారం మంజూరు చేసిందని, ఈ పరిహారాన్ని పదిలక్షల రూపాయల వరకు పెంచాలని ఆదేశించారని, త్వరలో దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ అవుతాయని డిప్యూటీ సిఎం వివరించారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.తులసి, శాంతికుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా బడ్జెట్ కేటాయింపులు పెంచి, ప్రతి విద్యార్థికి రూ.20 చొప్పున అందించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికులు అప్పులు చేసి వంట నిర్వహణ చేస్తున్నారని తెలిపారు. వంట నిర్వహణ ప్రదేశాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరణ చేయొద్దని డిమాండ్‌చేశారు. రాజకీయ జోక్యంతో మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపులు ఆపాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేసి, యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కరించకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా మూసివేసిన పాఠశాలల్లోని ఎండిఎం కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎండిఎం కార్మికులు పద్మ, పావని, భవాని, చిలకమ్మ, లక్ష్మి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ప్రతిఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఆధార్ అప్‌డేట్ చేయడంపై గ్రామ, వార్డు సచివాలయ విభాగం ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేసి చిన్నారుల ఆధార్ నమోదు, అప్‌డేట్ చేయాలని చెప్పారు. గ్రామాల వారీగా ఉన్న పెండింగ్ జాబితా అందించాలని ఆధార్ అధీకృత సంస్థ ప్రాజెక్టు మేనేజర్ జి.గిరీష్‌ను కోరారు.

అనంతరం యుఐడిఎఐ ప్రాజెక్టు మేనేజర్ గిరీష్ మాట్లాడుతూ ఆధార్‌ను ప్రతి పదేళ్లకు ఒకసారి విధిగా అప్‌డేట్ చేయాలన్నారు. 18 ఏళ్లు పూర్తి చేసుకుని ఉండి, కొత్తగా ఆధార్ పొందుటకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రానికి వెళ్లాలన్నారు. జిల్లాలో 123 ఆధార్ కేంద్రాలు నడుస్తున్నాయని చెప్పారు. జిల్లాలో 3.50 లక్షల మంది నమోదు, ధ్రువీకరణ పత్రాలు అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆసుపత్రుల్లో శిశు జననాల నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. జిల్లాలోని బ్యాంకు శాఖల్లో కనీసం 10 శాతం బ్రాంచుల్లో ఆధార్ కేంద్రాలు ఉండాలని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ సమయంలో నకిలీ ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారుల ధృవీకరణతో వస్తున్న సందర్భాలు ఉన్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అప్‌డేటెడ్ ఆధార్ పొందుటకు అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.

ఈ సమావేశంలో డిఆర్ఒ జె.వెంకట రావు, గ్రామ, వార్డు సచివాలయ సమన్వయ అధికారి వాండ్రంగి చిట్టిబాబు, డిఎస్‌పి ఎ.సుభాష్, డిఎంహెచ్‌ఒ బగాది జగన్నాథరావు, డిఎల్‌డిఒ గోపాలకృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ కె.విజయగౌరి, ఇన్‌ఛార్జి డిఇఒ పి.బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్‌పై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఉన్నతాధికారులు

ఖాకీల మానవత్వం

గిరిజన మహిళ మృతదేహాన్ని ఒడిశా తరలింపు

ప్రజాశక్తి-విజయనగరం

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ సొరడ గ్రామానికి చెందిన ఈడే గురు (30) అనే మహిళ అనారోగ్యానికి గురవ్వడంతో ఆమె భర్త సాములు విశాఖపట్నం జిల్లా తగరపు వలస వద్దగల అనిల్ నీరుకొండ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించాడు. చికిత్సకు స్పందించడం లేదని తిరిగి సొంత ఊరు తీసుకొని వెళ్లిపోవాలని వైద్యులు తెలిపారు. చేసేది ఏమీ లేక భార్యను తీసుకొని, ఆటోలో విజయనగరం వస్తుండగా మార్గ మధ్యంలో భార్య ఈడే గురు మరణించింది. అర్ధంతరంగా ఆటో డ్రైవరు చెల్లూరు రింగురోడ్డులో వారిని దించేసి వెళ్ళిపోయాడు. దిక్కుతోచని స్థితిలో భర్త తన భార్య శవాన్ని ఎలా ఒడిశాకు చేర్చాలో తెలియక భార్య శవాన్ని భుజం మీద వేసుకొని, కాలి నడకన బయలుదేరాడు. ఈ ఘటనను చూసిన స్థానికులకు ఏమీ జరిగిందో తెలియక, అతను ఒడియాలో చెప్పిన విషయం అర్ధంకాక స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ టివి తిరుపతిరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్‌తో కలిసి, చెల్లూరు రింగు రోడ్డు వద్దకు వెళ్లి పరిశీలించగా, సాములు తన భార్య మృతదేహాన్ని భుజాన వేసుకొని వెళ్తుండడాన్ని గమనించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఒడిశాలో అతని బంధువులతో ఫోనులో మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు రూరల్ సిఐ టివి తిరుపతిరావు ఒడిశా రాష్ట్రం సుంకి వరకు అంబులెన్స్ ఏర్పాటు చేసి మానవత్వం చూపారు. పోలీసులు అందించిన సహాయానికి శాములు కతజ్ఞతలు తెలపగా, సమయానుకూలంగా స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.


భార్య మృతదేహాన్ని భుజంపై మోసుకుని వెళ్తున్న సాములు


అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

లక్ష్యాలే ముఖ్యం... సౌకర్యాలు శూన్యం

ఉపాధి పనుల వద్ద కనిపించని మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

గ్రామాల్లో వలసల నివారణ కోసం అమలు చేసిన ఉపాధిహామీలో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు లక్ష్యాలు పూర్తిచేయడంలో చూపిస్తున్న శ్రద్ధ కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం కనిపించడం లేదు. ఉపాధి పనులు జరిగిన ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదు. మండలంలో 660 ఉపాధి పనులకుగాను 6,600 మంది కూలీలు పనిచేస్తున్నారు. అయితే లక్ష్యాలు పూర్తిచేయడంలో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పని కల్పిస్తున్నారు. సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలంటూ కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. అయితే సౌకర్యాలు మాత్రం ఎక్కడా పూర్తిగా లేవు. ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాల్లో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాల్సి ఉంది. 5 లీటర్ల నీరు తెచ్చుకోవడానికి ప్రభుత్వం వారికి రుసుం చెల్లించాల్సి ఉంది. అయితే వాటన్నింటికీ పాతర వేసి పనులే లక్ష్యంగా చేయిస్తున్నారు. దీంతో కూలీలు ఎండల్లో పనులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు వేడెక్కుతున్నాయి. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.


భాసూరులో మండుటెండలో చేపడుతున్న ఉపాధిహామీ పనులు

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలో గోపాలపురం, గొట్టమంగళాపురం, చినమంగళాపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని, కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయాలని సూచించారు.

సీతానగరం : మండలంలోని చినభోగిలి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులకు సమయానికి రావాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. పని ప్రదేశం నుంచే మస్తర్లను ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. పని ప్రాంతాల్లో టెంట్లు ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : భామిని దొరగారి చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ జి.కృష్ణారావు బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సంఖ్య, మస్టర్ సీట్లు, హాజరును పరిశీలించారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచేలా చూడాలని, వేతనం గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ బిడ్డికి మధును ఆదేశించారు. కార్యక్రమంలో కంప్యూటర్ అసిస్టెంట్ పోతల రఘు, మేట్లు తిరుపతి, శ్రీను, రవి పాల్గొన్నారు.

ఖాళీ అవుతున్న నిర్వాసిత గ్రామాలు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రతిపాదిత ప్రాంతంలో నిర్వాసితులైన బైరెడ్డి పాలెం పంచాయతీ మూడసర్ల పేటకు చెందిన 35 నిర్వాసిత కుటుంబాలు బుధవారం పోలిపల్లి రెవెన్యూ పరిధిలో వారికి ఏర్పాటు చేసిన కాలనీలకు బయలుదేరారు. నిర్వాసిత కాలనీలలో పూర్తిస్థాయిలో గృహాలు తయారీ కానప్పటికీ అధికారుల ఒత్తిడితో బయలుదేరినట్లు బాధితులు వాపోతున్నారు. పది రోజులు సమయం ఇచ్చుంటే బాగుండేదని బాధితులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా జీవనం సాగించినటువంటి ప్రాంతాన్ని వదిలి వెళ్లేందుకు బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. నిర్వాసితుల ఇల్లులన్నీ పూర్తిస్థాయిలో నేలమట్టం చేశారు. నిర్వాసితులకు లింగాలవలస మెట్టపై యాత కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లిబోయిన నర్సింగరావు భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఆధార్ కేంద్రాన్ని ఎంపిడిఒ కృష్ణమహేశ్‌రెడ్డి పరిశీలించారు. ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఆయా విద్యాసంస్థల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సూరంపేట సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సకాలంలో హాజరు వేయాలని, వాలంటీర్ల ద్వారా సర్వేలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎంఎస్ఎల్‌వి ప్రసాద్, ఇఒపిఆర్‌డి కె.కె.వర్మ పాల్గొన్నారు.

సంతలను ఆధునీకరించాలి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని సీతంపేట, దోనుబాయి, కుసిమి, పూతికవలస, మర్రిపాడు, బామిని సంతలను ఆధునీకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.భాస్కర్‌రావు.. ఐటిడిఎ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. 60 వేల మంది గిరిజనులకు ఈ సంతలే ప్రధాన మార్కెట్ అన్నారు. జిసిసి ప్రోత్సాహం కరువైన గిరిజనులు సంతల ద్వారా తమ ఉత్పత్తులు అమ్ముకుంటున్నారని తెలిపారు. సంతల్లో ఎక్కడా సరైన సదుపాయాలు లేవన్నారు. ఐటిడిఎ అధికారులు గిరిజనులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.

భూహక్కు పత్రాలు తయారు చేయాలి

ప్రజాశక్తి-పాలకొండ

అసైన్డ్ భూములకు సంబంధించి భూహక్కు పత్రాలు తయారు చేయాలని తహశీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూములకు సంబంధించి సర్వే పూర్తయిందని, రైతుల హక్కు పత్రాలు తయారు చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి బి.ప్రజ్ఞ

పెదగొత్తిలిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో పెదగొత్తిలి గ్రామంలో 104 ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ ఫిజికల్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ఎంఎల్‌హెచ్ పి.లలిత, హెల్త్ విజిటర్ భారతి, ఇఒ సత్యరాజు, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వెంకంపేటలో..

పార్వతీపురంరూరల్ : మండలంలోని వెంకంపేటలో పిఎంపిల అసోసియేషన్ ఆధ్వర్యాన అనిల్‌నీరుకొండ మెడికల్ కళాశాల సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య బృంద ప్రతినిధి ప్రసాదరావు ఆధ్వర్యంలో వైద్యులు 230 మందికి పరీక్షలు చేశారు. సుమారు 30 మందికి స్కాన్, శస్త్రచికిత్సల నిమిత్తం విశాఖకు తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ తీళ్ల కృష్ణారావు. పిఎంపిల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, బొంతలకోటి వెంకటరమణ, బాసంగి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

పారుడు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

చిన్నపారుడు రోగ నివారణలో భాగంగా రెల్ల రైతు భరోసా కేంద్ర పరిధిలోని గ్రామాల్లో ఎంపిపి కె.దీనమయ్య, సర్పంచ్ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలకు బుధవారం టీకాలు వేశారు. పశువైద్య అధికారి పేకాపు లక్ష్మణరావు మాట్లాడుతూ టీకాలు వేయడం ద్వారా గొర్రెలు మేకలకు పెదాలు, నాలుకపై, నోటి లోపల చిన్న పొక్కులు, రక్తంతో కూడిన చీమిడి, దగ్గు, దుర్వాసనతో కూడిన విరోచనాలు వంటి లక్షణాలను అరికట్ట వచ్చన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు , పశుసంవర్ధక సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తలలేని దూడ జననం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కొత్తపనుకువలసలో శివాల తిరుపతిరావుకు చెందిన ఆవు బుధవారం తల లేని దూడకు జన్మనిచ్చింది. జన్యుపరమైన లోపం వల్ల ఇలా జరుగుతుందని పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీనివాస్ తెలిపారు. ఆవుకు ఆరు రొమ్ములు ఉన్నాయని, ఇది కూడా జన్యుపరమైన సమస్యని చెప్పారు.


తలలేని దూడ

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపిడిఒ ఎ.ప్రభాకర్‌రావు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన సచివాలయ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడటంతోపాటు పంచాయతీలను అభివృద్ధి పరిచేందుకు కూడా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రానికి తరలించి, ఆదాయం సమకూర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

వియ్యంపేట ఆస్పత్రికి వితరణ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని జిందాల్ స్టెయిన్ స్టీల్ కంపెనీ, జిందాల్ నగర్ యాజమాన్యం సి.ఎస్.ఆర్. యాక్టివిటీలో భాగంగా వియ్యంపేట పి హెచ్‌సికి వితరణగా ఇన్వెర్టర్, రెండు బ్యాటరీలు, రెండు కంప్యూటర్స్, డెలివరీ లాంప్, ఫోకస్ లాంప్, ఛార్జింగ్ లైట్, బీపీ ఆపరేటర్ స్పాన్సర్ చేసినట్లు జనరల్ మేనేజర్ హెచ్.ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. వియ్యంపేట ఆసుపత్రి సిబ్బంది జిందాల్ కంపెనీ యూనిట్ హెడ్ దినేష్ శర్మకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

గజపతినగరం : స్థానిక సాయి సిద్ధార్థ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. రక్తదాతల నుంచి గజపతినగరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. కృష్ణారావు ఆధ్వర్యంలో వైద్య బృందం రక్త నిల్వలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అని అన్నారు. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడిన వాళ్ళు అవుతారని అన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎస్ కృష్ణారావు, పాల్గొన్నారు.

ఆర్‌డిఎంఎ విస్తృత పర్యటన



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌డిఎంఎ నాగరాజు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు విస్తృతంగా పర్యటించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడుతో కలిసి ముందుగా డంపింగ్ యార్డును పరిశీలించారు. బెలగాంలో ఉన్న చెత్త శుద్ధి కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించి, డంపింగ్ యార్డుకు తరలింపు చర్యలపై కమిషనర్‌ను అడిగారు. అనంతరం డాక్టర్ సన్యాసి రాజు స్మారక మున్సిపల్ పార్కును సందర్శించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్‌ను పరిశీలించారు. పర్మినెంట్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు. అనంతరం కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగంలో అధికారులతో పట్టణంలో అభివృద్ధి పనుల చేపడుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్ల వందశాతం పూర్తిచేయాలని సూచించారు. జిల్లా కేంద్రంగా ఏర్పడిన పార్వతీపురంలో భవనాల క్రమబద్ధీకరణకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో కలిసి పరిశీలించాలని చెప్పారు. భవన నిర్మాణ యజమానులు నిర్మాణానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే దిశగా కృషి చేయాలని సూచించారు.

విడివికెలకు గిరిజన ఉత్పత్తులు అమ్మండి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

పసుపు, జీడి, చింతపండు, అపరాలు, కొండచీపుర్లు తదితర గిరిజన ఉత్పత్తులను వన్‌ధన్ వికాస కేంద్రాలకు విక్రయించాలని ఎపిఎం సింహాచలం కోరారు. బుధవారం మండలంలోని కొదమ, పట్టుచెన్నూరు మధ్య గిరిజన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు, చింతపండు, అపరాలు కొనుగోలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. విఒఎల ద్వారా పంట సాగుపై సర్వే చేశామని తెలిపారు. మండల కేంద్రంలో త్వరలో ఏర్పాటు చేసే మహిళా మార్టుకు ప్రతి మహిళా రూ.300 సభ్యత్వం చెల్లించాలని తెలిపారు. సమావేశంలో సిసిలు కృష్ణవేణి, నిర్మల, సంజీవరావు, రామకృష్ణ, అనిల్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ నూరుల్ కమర్


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

భూముల రీసర్వేను వేగవంతంగా చేసేందుకు చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, సర్వేయర్, సచివాలయ సిబ్బంది అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మండలంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. మండల కేంద్రంలో ఉన్న ఆర్అండ్‌బి జూనియర్ ఇంజనీర్ క్వార్టర్స్, పక్కనే ఉన్న ఎస్‌డిసి కార్యాలయ భవనాలను, ఇరిడిలో ఉన్న జీడి ప్రాసెసింగ్ యూనిట్ల భవనాలను, జెకెపాడు గ్రామంలో కొన్ని భవనాలను ఆయన పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ రాములమ్మకు పలు సూచనలు జారీ చేశారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఈ ఏడాది జీడి పంట అధికంగా రానున్న నేపథ్యంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశాలను చూస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు, సిఐటియు నాయకులు

రొడ్డవలస జంక్షన్‌లో

నిత్యావసర సరుకులు అందించాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

రొడ్డవలస జంక్షన్‌లో జిసిసి ద్వారా నిత్యావసర సరుకులు అందించాలని కోరుతూ గిరిజనులు బుధవారం నిరసన చేపట్టారు. గల్లపాడు, పర్వపురం, మెట్టవలస, తదితర గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు జిసిసి ద్వారా రొడ్డవలస జంక్షన్ వద్ద పంపిణీ చేయాలని పి.రమేష్, పి.అప్పన్న, సింహాద్రి అధికారులను కోరారు. రేషన్ కోసం సుమారు 25 కిలోమీటర్ల దూరం రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేసలి పంచాయతీ మడవలస వెళ్లడానికి ఒక్కొక్కరికి రూ.400పైగా ఖర్చవుతుందన్నారు. దీంతోపాటు వ్యవసాయ పనులు మానుకొని, రోజుల తరబడి తిరిగి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా డిపోని తమకు అందుబాటులోకి మార్చలేదని వాపోయారు. గిరిజనుల ఆందోళనకు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు మద్దతు తెలిపారు. గిరిజనులకు అందుబాటులో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

వైసిపి పాలనలో అన్నీ కష్టాలే

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన బీరుపాడు పంచాయతీ లాడ, శ్రీరంగపాడు గిరిజన గ్రామాల్లో ఇదేం కర్మ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియా రాజ్యమేలుతున్నాయని అన్నారు. ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టంగా మారిందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంపటాపు భారతి, కిల్లక దాసు, సుందర్‌రావు, రమేష్, భాస్కరరావు, రామారావు, లోవరాజు పాల్గొన్నారు.


ఇదేం కర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న తోయక జగదీశ్వరి

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

జియ్యమ్మవలస : కూనేరు, రామభద్రపురం సమీపంలోని రీచుల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని చినమేరంగిలో శత్రుచర్ల నివాసంలో టిడిపి నియోజకవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి మాట్లాడుతూ ఐదు మండలాల్లోని నాయకులు ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, 22న చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని తీర్మానించారు.

అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-వీరఘట్టం

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాలకొండ డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం మండలంలోని దశమంతపురం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని సిబ్బందికి సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ఎ.ప్రభాకర్‌రావు, సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, సచివాలయ కార్యదర్శి కె.సునీల్ కుమార్ పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ


పాచిపెంట.. రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు

అధిక దిగుబడికి గులిచోడి విధానం

ప్రజాశక్తి-పాచిపెంట

గులిచోడి సాగు పద్ధతి ద్వారా చోడి పంట దిగుబడిని రెట్టింపు చేసుకోవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని కేసరి గ్రామంలో రైతు మీసాల మోహన్‌రావు పొలంలో ప్రయోగాత్మకంగా గులిచోడి సాగుపద్ధతిని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ చోడిపంట సాగు విధానం కంటే గులిచోడి పద్ధతి ద్వారా దిగుబడులు రెట్టింపు చేసుకోవచ్చన్నారు. ఈ విధానం అతి సులువైనదని, తక్కువ సాగు ఖర్చు, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడి పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సత్తారపు రాము, ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, తిరుపతి నాయుడు, సురేష్, విజయ్‌కుమార్, విఎఎ రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

భామిని : రబీ సీజన్లో మొక్కజొన్న సాగుచేసే రైతులు సుస్థిరమైన సాగువిధానాలు ఆవలంబించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.సింహాచలం తెలిపారు. బుధవారం బాలేరు గ్రామంలో మొక్కజొన్న పొలంలో వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పండించే రైతులు ప్రతి రోజూ పంట, పరిసరాల్లో మిత్ర పురుగులు, శత్రు పురుగులు శాతాన్ని పరిశీలించాలని చెప్పారు. 2:1 నిష్పత్తిలో ఉంటే ఏ రసాయనాలూ పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. మొక్క జొన్న పంట మోకాలి దశలో ఉన్నప్పుడు ఎకరాకు 25 నుంచి 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాస్ చల్లాలనిసూచించారు. బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్, విఎఎ ఆర్.జ్యోతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జీడితోట దగ్ధం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పెదమరికి పంచాయతీలోని చందలంగి గ్రామంలో మొల్లిక ఆనంద్‌కు చెందిన రెండున్నర ఎకరాల్లోని జీడితోట మంగళవారం రాత్రి కాలిపోయింది. పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో ఆకస్మికంగా సంభవించిన అగ్ని ప్రమాదం వల్ల జీవనోపాధిని కోల్పోయామని ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. నష్టాన్ని విఆర్‌ఒ మంగమ్మ అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.


కాలిపోయిన జీడితోట


ఘటనా స్థలంలో మృతిచెందిన నేతాజి

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటన నిర్వాసిత గ్రామం నవిరికాలనీకి చెందిన నేతాజి (35) మరణించాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని మోసూరు పంచాయతీ సురగడవలస సమీపంలో బుధవారం ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ ఘటన ఒడిశాలోని పొట్టంగి బ్లాక్ పరిధిలో గొల్లూరు గ్రామానికి చెందిన గెమ్మెల పైడమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్‌లో కూలీలను తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆమెను చికిత్స నిమిత్తం సాలూరు సిహెచ్‌సికి తరలించారు. పాచిపెంట ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు.